

# మీ అభిమానం దేవుడిచ్చిన వరం

**తారక్** పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 20న 'వార్ 2' టీజర్ విడుదలైన విషయం తెలిసిందే. ఈ టీజర్‌కు వస్తున్న స్పందనపై తాజాగా ఎన్టీఆర్ స్పందించారు. 'ఈ ప్రశంసలు, అభిమానులు కురిపిస్తున్న ప్రేమ చూస్తుంటే నటుడ్ని అయినందుకు సంతోషంగా, గర్వంగా ఉంది. అభిమానుల ప్రేమను దేవుడిచ్చిన వరంలా భావిస్తున్నా. ముఖ్యంగా 'వార్ 2'పై మీరు చూపిస్తున్న ప్రేమకు థ్యాంక్స్. దేశంలోని ప్రతి మూల నుంచి వస్తున్న స్పందన చూసి ఉప్పొంగిపోయాను. ఒక్క టీజర్ ఇంతటి ప్రభావం చూపించడం, ఆడియన్స్‌పై ఇంతటి ముద్ర వేయడం సామాన్యమైన విషయం కాదు. నిజంగా ఈ స్పందన చూస్తుంటే పట్టరాని ఆనందం కలుగుతోంది. ఈ యష్‌రాజ్ స్పై యూనివర్స్‌లో నన్ను కొత్తగా చూపించారు. ఈ మూవీ కోసం అంతా ఎంతో సరదాగా కలిసి పనిచేశాం. ఇందులో నా పాత్ర చాలా ప్రత్యేకమైనది. బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా బెంచ్‌మార్క్ క్రియేట్ చేయడం ఖాయం. రేపు థియేటర్లలో మీ స్పందన చూసేందుకు ఎదురు చూస్తున్నా.' అని తారక్ అన్నారు. హృతిక్‌రోషన్, ఎన్టీఆర్ హీరోలుగా నటించిన ఈ సినిమాలో కియారా అద్వానీ కథానాయిక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఆదిత్య చోప్రా నిర్మాణంలో అయాన్ ముఖర్జీ తెరకెక్కిస్తున్న ఈ చిత్రం ఆగస్ట్ 14న విడుదల కానుంది.

# రంగంలోకి ఉస్తాద్ భగత్‌సింగ్



ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు నిర్వర్తిస్తూ పరిపాలనా వ్యవహారాల్లో బిజీగా ఉండటం వల్ల అగ్ర హీరో పవన్‌కల్యాణ్ నటిస్తున్న సినిమా షూటింగ్స్ అన్నీ వాయిదా పడుతూ వచ్చాయి. ప్రస్తుతం ఆయన రాజకీయ వ్యవహారాల్ని చూసుకుంటూనే సినిమాల కోసం కూడా కాస్త సమయాన్ని కేటాయిస్తున్నారు. ఇప్పటికే 'హరిహరవీరమల్లు' షూటింగ్‌ని పూర్తి చేశారు కూడా. ప్రస్తుతం 'ఓజీ' షూటింగ్‌లో ఆయన బిజీగా ఉన్నారు. తాజాగా 'ఉస్తాద్ భగత్‌సింగ్' షూటింగ్‌ను కూడా జూన్‌లో మొదలుపెట్టనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. హరీష్‌శంకర్ దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నది. ఇందులో పవన్‌కల్యాణ్ పోలీస్ అధికారి పాత్రలో కనిపించనున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం తెరకెక్కుతున్నదని మేకర్స్ తెలిపారు. శ్రీలీల కథానాయికగా నటిస్తున్న ఈ సినిమాలో అశుతోష్ రానా, నవాబ్‌షా, గౌతమి ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ప్రొడక్షన్ డిజైనర్: ఆనంద్ సాయి, రచన-దర్శకత్వం: హరీష్‌శంకర్.



# స్టార్‌గా నాకు జన్మనిచ్చింది తెలుగు సినిమానే

'నిర్మాణంలో ఉన్నప్పుడే కొత్త అనుభవాన్నిచ్చిన సినిమా 'థగ్‌లైఫ్'. నా కెరీర్‌లో ఎన్నో పాత్రలు పోషించా. కానీ 'థగ్‌లైఫ్'లో చేసిన శక్తివేల్‌రంగరాయన్ పాత్ర నిజంగా ప్రత్యేకం. దర్శకునిగా మణిరత్నంలో చాలా మార్పు చూశాను. ఆయనలోని కంప్లీట్ డైరెక్టర్‌ని 'థగ్‌లైఫ్'లో చూస్తారు. ఈ సినిమాకు పనిచేసిన వారంతా ప్రతిభావంతులే. అందుకే చెబుతున్నా.. 'నాయకన్' కంటే నెక్ట్స్ లెవల్లో ఉంటుందీ సినిమా. నటుడిగా ఇతర భాషలో పరిచయమైనా స్టార్‌గా నాకు జన్మనిచ్చింది మాత్రం తెలుగు సినిమానే. జనరేషన్స్ మారుతున్నా నన్ను ఆదరిస్తున్నందుకు ఆడియన్స్‌కి థ్యాంక్స్. థియేటర్లలో మీ రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నా.' అని కమల్‌హాసన్ అన్నారు. ఆయన హీరోగా మణిరత్నం దర్శకత్వంలో వస్తున్న ప్రతిష్టాత్మక పానిండియా చిత్రం 'థగ్‌లైఫ్'. కమల్‌హాసన్, మణిరత్నం, మహేంద్రన్, శివ అనంత్, ఉదయ్‌నిధి మారన్ నిర్మాతలు. శ్రేష్ట్ మూవీస్ ద్వారా ఈ చిత్రాన్ని ఎన్.సుధాకర్‌రెడ్డి తెలుగులో విడుదల చేస్తున్నారు. జూన్ 5న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా గురువారం హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కమల్‌హాసన్ మాట్లాడారు. మణిరత్నం మాట్లాడుతూ ''మౌనరాగం' టైమ్‌కి నేను చిన్న దర్శకుడ్ని. నాపై నమ్మకంతో 'నాయకన్' అవకాశమిచ్చారు కమల్. ఆ సినిమా లేకపోతే నేను లేను. ఇప్పుడు 38ఏండ్ల తర్వాత 'థగ్‌లైఫ్' చేశానంటే కారణం కూడా 'నాయకన్' సినిమానే. కమల్‌తో పనిచేయడమే ఓ గొప్ప అనుభూతి. ఇందులో ఆయన శక్తివేల్‌రంగరాయన్‌గా కనిపిస్తారు. ఆయన అద్భుతమైన నటనను మరోసారి చూస్తారు.' అని తెలిపారు. ఇంకా శింబు, సుహాసిని, త్రిష, అభిరామి, నాజర్, తనికెళ్ల భరణి, ఎన్.సుధాకర్‌రెడ్డి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# భాగ్యనగరిలో 'పెద్ది' పోరు



**రామ్‌చరణ్** 'పెద్ది' చిత్రాన్ని గ్రామీణ క్రీడా నేపథ్యంలో తెరకెక్కిస్తున్న విషయం తెలిసిందే. ఈ కథలోని రా అండ్ రస్టిక్ బ్యాక్‌గ్రౌండ్, పల్లెటూరి మూలాలను, వాతావరణాన్ని ప్రతిబింబిస్తూ హైదరాబాద్‌లో భారీ విలేజ్ సెట్‌ను తీర్చిదిద్దారు. కళా దర్శకుడు అవినాష్ కొల్లా తీర్చిదిద్దిన ఈ సెట్‌లో ఇంటెన్స్ యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు కొంత టాకీ పార్ట్‌ను చిత్రీకరించబోతున్నారు. గురువారం ఈ అప్‌డేట్‌ను పంచుకున్న మేకర్స్ ఆన్ లొకేషన్ స్టిల్స్‌ను విడుదల చేశారు. ఇందులో రామ్‌చరణ్ బాగా పెరిగిన జుట్టు, గడ్డంతో సరికొత్త మేకోవర్‌లో కనిపిస్తున్నారు. ఆయన పాత్ర తాలూకు వైవిధ్యం లుక్‌లో కనిపిస్తున్నది. ఇప్పటికే 30 శాతం చిత్రీకరణ పూర్తయిందని, తాజా షెడ్యూల్‌లో ప్రధాన భాగానికి సంబంధించిన షూటింగ్ పూర్తవుతుందని మేకర్స్ పేర్కొన్నారు. క్రికెట్, కుస్తీ పోటీల నేపథ్యంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27ఈ సినిమా ప్రేక్షకుల ముందుకురానుంది. జాన్వీకపూర్, శివరాజ్‌కుమార్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: ఏ.ఆర్.రెహమాన్, నిర్మాణ సంస్థలు: మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్, వృద్ధి సినిమాస్, రచన-దర్శకత్వం: బుచ్చిబాబు సానా.


# విరిసిన సింధూరం

## పదిలం ఈ బంధం



అగ్ర నటి ఐశ్వర్యరాయ్‌కి కేన్స్ చిత్రోత్సవంతో సుదీర్ఘ అనుబంధం ఉంది. 2002లో ఈ వేదికపై తొలిసారి మెరిసిన ఈ ప్రపంచ సుందరి ప్రతీ ఏడాది క్రమం తప్పకుండా హాజరవుతూ వీక్షకుల్ని మెస్మరైజ్ చేస్తున్నది. ప్రస్తుతం జరుగుతున్న 78వ కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌కు ఐశ్వర్యరాయ్ హాజరయ్యారు. ఈసారి సంప్రదాయ భారతీయ వస్త్రధారణలో ఆమె కనిపించారు. బెనారసీ చీర, వజ్రాలు పొదిగిన వివిధ హారాలను ధరించి రాయల్‌లుక్‌లో కేన్స్ ఎర్రతివాచీపై హొయలొలికించింది. అన్నింటికంటే ముఖ్యంగా ఐశ్వర్యరాయ్ నుదుటిన పెట్టుకున్న సిందూరం అందరి దృష్టిని ఆకర్షించింది. పహల్గాం ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌కు ప్రతీకలా, పాకిస్థాన్ ప్రాయోజిత తీవ్రవాదంపై ఓ నిరసన ప్రకటనలా ఆమె సిందూరం ధరించారని అంటున్నారు. మరోవైపు గత కొన్ని నెలలుగా అభిషేక్ బచ్చన్-ఐశ్వర్యరాయ్ వివాహబంధంపై పుకార్లు వస్తున్నాయి. ఈ దంపతులిద్దరూ విడిపోనున్నారని బాలీవుడ్ మీడియాలో వార్తలొచ్చాయి. వాటన్నింటికి చెక్ పెడుతూ తమ బంధం తాలూకు విశ్వాసం, ప్రేమ, నిబద్ధతను చాటిచెప్పేలా ఆమె సిందూరం ధరించిందని అనుకుంటున్నారు. ప్రముఖ డిజైనర్ మనీష్ మల్హోత్రా డిజైన్ చేసిన బనారస్ చీరతో పాటు నుదుటిన సిందూరంతో ఈ ఏడాది ఐశ్వర్యరాయ్ కేన్స్‌లో భారతీయుల హృదయాల్ని కొల్లగొట్టింది. ఆమె లుక్‌పై సోషల్ మీడియాలో ప్రశంసలు వెల్లువెత్తున్నాయి.

# పుస్తకరూపంలో మోహన్‌లాల్ జీవితం



దేశంలోని పేరెన్నికగన్న మహానటుల జాబితాలో మలయాళ సూపర్‌స్టార్ మోహన్‌లాల్ కచ్చితంగా ఉంటారు. 47ఏండ్ల సినీ ప్రస్థానం ఆయనది. దాదాపు 400 సినిమాల్లో వైవిధ్యమైన పాత్రలు పోషించారాయన. మోహన్‌లాల్‌లోని మరో కోణం సేవాగుణం. 'విశ్వశాంతి ఫౌండేషన్' పేరిట ఓ స్వచ్ఛంద సంస్థను స్థాపించి, చిల్డ్రన్స్ హాస్పిటల్స్ భాగస్వామ్యంతో ఆర్థికంగా వెనుకబడ్డ కుటుంబాలకు చెందిన పిల్లలకు సబ్సిడీ ధరలతో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలను ముమ్మరంగా చేయించిన ఘనత మోహన్‌లాల్‌ది. దీంతోపాటు మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రచారాన్ని కూడా నిర్వహించారు మోహన్‌లాల్. వీటన్నింటినీ దృష్టిలో పెట్టుకొనే ఆయనకు కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మక పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. ఇంకో మూడేండ్లలో మోహన్‌లాల్ 50ఏండ్ల కెరీర్‌ని పూర్తి చేసుకోనున్నారు. ఈ ఘనతలన్నింటినీ పొందుపరుస్తూ.. మోహన్‌లాల్ జీవితంపై త్వరలో ఓ పుస్తకం రానుంది. 'ముఖరాగం' పేరుతో ప్రచురితమవుతున్న ఈ పుస్తకాన్ని కేరళకు చెందిన ఓ ప్రముఖ సాంస్కృతిక సంస్థ ప్రేక్షకులకు అందించనున్నది. త్వరలో రానున్న ఈ పుస్తకం కోసం కోట్లాది మంది మోహన్‌లాల్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

# థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో 'నిశ్శబ్ద ప్రేమ'



శ్రీరామ్, ప్రియాంక తిమ్మేష్ జంటగా నటించిన చిత్రం 'నిశ్శబ్ద ప్రేమ'. రాజ్‌దేవ్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని కార్తికేయన్ నిర్మించారు. నేడు రిలీజ్ కానుంది. బుధవారం ట్రైలర్‌తో పాటు పాటల్ని విడుదల చేశారు. తమిళంలో ఈ సినిమాకు మంచి ఆదరణ లభించిందని, తెలుగులో కూడా అదే రీతిలో మెప్పిస్తుందనే నమ్మకం ఉందని దర్శకుడు రాజ్‌దేవ్ తెలిపారు. హీరో శ్రీరామ్ మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ ఎలిమెంట్స్‌తో సాగే ప్రేమకథా చిత్రమిది. ఆద్యంతం ఉత్కంఠభరితమైన కథ, కథనాలతో ఆకట్టుకుంటుంది. తెలుగు డబ్బింగ్ బాగా కుదిరింది. తప్పకుండా ఇక్కడి ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

# కేన్స్‌లో విశ్వంభర హంగామా



అగ్రహీరో చిరంజీవి నటిస్తున్న మోస్ట్ అవైటెడ్ సోషియా ఫాంటసీ డ్రామా 'విశ్వంభర'. వశిష్ఠ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని యూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా ప్రమోషన్స్‌ని కూడా మేకర్స్ మొదలుపెట్టిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే.. ప్రస్తుతం జరుగుతున్న కేన్స్ అంతర్జాతీయ ఫెస్టివల్‌లో 'విశ్వంభర' చిత్రం చర్చనీయాంశమైంది. ఈ చిత్ర నిర్మాతల్లో ఒకరైన విక్రమ్‌రెడ్డి.. కేన్స్ ఫెస్టివల్‌లో 'విశ్వంభర ఎక్స్‌క్లూజివ్ బుక్'ను లాంచ్ చేశారు. తదనంతరం 'విశ్వంభర' కథ, భారతీయ పురాణాల విశిష్టత, బుక్ విశేషాలను ఆహుతులకు వివరించారు. దీంతో.. ఈ మెగా మాస్ మూవీ మేనియా సరిహద్దులు దాటి గ్లోబల్‌కి చేరినట్టయ్యిందని పలువురు అభిప్రాయపడుతున్నారు. టాప్ హాలీవుడ్ వీఎఫ్ఎక్స్ స్టూడియోల భాగస్వామ్యంతో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించిన పోస్ట్ ప్రొడక్షన్, వీఎఫ్ఎక్స్ పనులు ఇప్పటికే 90శాతం పూర్తయ్యాయని, నిర్మాణం పూర్తయ్యాక, విడుదల తేదీని ప్రకటిస్తామని మేకర్స్ తెలిపారు. త్రిషా కృష్ణన్ కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఆశికా రంగనాథ్ కీలక పాత్ర పోషిస్తున్నారు. కునాల్ కపూర్ మరో ముఖ్యపాత్రలో మెరవనున్నారు. ఈ చిత్రానికి కెమెరా: చోటా కె.నాయుడు, సంగీతం: ఎం.ఎం.కీరవాణి.

# ఫుల్‌మీల్స్‌లాంటి సినిమా



'ఈ సినిమాలో యాక్షన్, రొమాన్స్ సమపాళ్లలో ఉంటాయి. ఓ వినూత్నమైన కథతో రూపొందించాం. తప్పకుండా తెలుగు ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుంది' అన్నారు అగ్ర హీరో విజయ్ సేతుపతి. ఆయన నటించిన తాజా చిత్రం 'ఏస్' నేడు ప్రేక్షకుల ముందుకొస్తున్నది. స్వీయ నిర్మాణ దర్శకత్వంలో అరుముగ కుమార్ తెరకెక్కించారు. రుక్మిణి వసంత్ కథానాయిక. ఈ చిత్రాన్ని శ్రీపద్మిని సినిమాస్ పతాకంపై బి.శివప్రసాద్ తెలుగులో విడుదల చేస్తున్నారు. గురువారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. గ్యాంబ్లింగ్ నేపథ్యం ఈ కథలో చిన్నభాగంగా మాత్రమే ఉంటుందని, క్రైమ్, కామెడీ, రొమాన్స్ అంశాలతో ఫుల్‌మీల్స్‌లాంటి సినిమా ఇదని దర్శకుడు అరుముగకుమార్ పేర్కొన్నారు. విజయ్ సేతుపతి అద్భుతమైన పెర్ఫార్మరని, అన్నీ కుదిరితే ఆయనతో 'రొమాంటిక్ డాన్' అనే చిత్రాన్ని త్వరలో ప్రకటిస్తానని నిర్మాత బి.శివప్రసాద్ తెలిపారు.



# సకుటుంబ కథాచిత్రం 'వైభవం'

రుత్విక్ హీరోగా నటిస్తున్న చిత్రం 'వైభవం'. సాత్విక్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి రమాదేవి నిర్మాత. నేడు ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం ప్రీరిలీజ్ వేడుకను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్మాత రమాదేవి మాట్లాడుతూ..తన కుమారులైన సాత్విక్, రుత్విక్ సినిమా మీద పాషన్‌తో కార్పొరేట్ ఉద్యోగాలను వదిలిపెట్టి ఇండస్ట్రీలో అదృష్టాన్ని పరీక్షించుకుంటూ ఈ సినిమా తీశారని, వారిద్దరూ విజయం సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు. చక్కటి మానవతా విలువలు, సునిశితమైన హాస్యం, కుటుంబ అనుబంధాలు కలబోసిన కథాంశమిదని, అన్ని వర్గాల వారిని మెప్పిస్తుందని దర్శకుడు సాత్విక్ పేర్కొన్నారు. ఈ సినిమా ద్వారా తెలుగులో కథానాయికగా పరిచయం కావడం ఆనందంగా ఉందని ఇక్రా ఇద్రిసి తెలిపింది.

# అసలుకే మోసం తెచ్చిన అత్యాశ..



ఆత్యాశకు పోయి బంగారంలాంటి అవకాశాన్ని చేతులారా జారవిడుచుకున్నదట బాలీవుడ్ భామ దీపిక పదుకోన్. ప్రస్తుతం బీటౌన్‌లో ఈ వార్త ఓ రేంజ్‌లో వైరల్ అవుతున్నది. వివరాల్లోకెళ్తే.. బిడ్డకు జన్మనివ్వడంవల్ల కొన్ని రోజులు సినిమాలకు దూరంగా ఉన్న దీపికా.. తాజాగా ప్రభాస్ 'స్పిరిట్' సినిమాకు సైన్ చేసింది. ఈ సినిమాలో నటిస్తున్నందుకుగాను పారితోషికం కూడా భారీగానే అందుకుంటున్నదని గతంలోనే వార్తలొచ్చాయి. కథ, పాత్రల రీత్యా ప్రభాస్‌కి జోడీగా దీపిక అయితేనే బావుంటుందని భావించడంతో అడిగినంత పారితోషికం ఇచ్చేందుకు నిర్మాతలు కూడా అంగీకరించారు. ఈ సినిమా నిర్మాతల్లో దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా కూడా ఒకరన్న విషయం తెలిసిందే. ఇక రేపో మాపో షూటింగ్ మొదలుపెడదాం అనుకుంటుంటే.. ఓవైపు దీపికా గొంతెమ్మ కోర్కెలు అంతకంతకూ ఎక్కువైపోతున్నాయట. ఆరు గంటలు మాత్రమే షూటింగ్‌లో ఉంటానని, పారితోషికంతోపాటు లాభాల్లో కూడా వాటా కావాలని, తన స్టాఫ్ శాలరీలు కూడా నిర్మాతలే భరించాలని ఇలా కోర్కెల చిట్టాను నిర్మాతల ముందు పెట్టేస్తున్నదట. దీంతో సందీప్‌రెడ్డి వంగా అసహనానికి లోనయ్యారని వినికిడి. మామూలుగానే సందీప్ ప్రాసెస్ కాస్త డిఫరెంట్‌గా ఉంటుంది. ఏదైనా ముఖంమీదే చెప్పేసే తత్వం ఆయనది. డేరింగ్, డాషింగ్ డైరెక్టర్ అన్నమాట. దాంతో ఈ సినిమాలో దీపిక ప్లేస్ డేంజర్‌లో పడిందని టాక్. ఆమెను సినిమా నుంచి తప్పించాలని గట్టిగా డిసైడ్ అయ్యారట సందీప్‌రెడ్డి వంగా. మరి ఆ ప్లేస్‌లో ఎవరొస్తారో చూడాలి.